


# సూర్య

దినపత్రిక

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా


సోమవారం,13 అక్టోబర్ 2025

8 పేజీలు


# తల్లికి వందనం కోసం ఎదురుచూపులు

## ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణాలు

**- రెండుసార్లు గ్రీవెన్స్‌లు పంపినా కరుణించని అమరావతి అధికారులు**




**ఏలూరు ఉమ్మడి ప.గో జిల్లా సూర్య బ్యూరో** : ఒకటో తరగతి నుండి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల కు రాష్ట్ర ప్రభుత్వం సదాశయంతో తల్లికి వందనం పథకం అమలు చేసింది. ఒక్కో విద్యార్థి తల్లి అకౌంట్లో 13 వేల రూపాయలు జమ చేసింది. కొన్ని కారణాలవల్ల కొందరికి ఈ సంక్షేమ పథకం అమలు కాలేదు. కరెంట్ బిల్లు అధికంగా ఉందని, 2 మీటర్లు ఉన్నాయని,ఆదాయంపన్నుచెల్లిస్తున్నారని,ఈకెవైసి చేయలేదని, నాలుగు చక్రాల వాహనం ఉందని,ఇంకా పలు కారణాలు చూపించి కొందరికి తల్లికి వందనం డబ్బులు నిలిపివేశారు. సచివాలయాల చుట్టూ తిరుగుతూ, వాళ్లు చెప్పిన సర్టిఫికెట్ల కోసం కాళ్లు అరిగేలా తిరుగుతూ, రెండు మూడుసార్లు అవసరమైన సర్టిఫికెట్లు సమర్పించి తిరిగి అమరావతికి గ్రీవె న్సులు పెట్టారు. ఆనాటి నుండి ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.ఇటీవలఅసెంబ్లీలో ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఈపథకంలో ఉన్న లోపాలను వచ్చే ఏడాది అయినా సరి చేయాలని, మిగిలిపోయిన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును కూడా భీమడోలు మండలంలో పలువురు మహిళలు కలిసి వారి గోడు వెళ్ల బోసుకున్నారు. కొన్నిచోట్ల తల్లికి వందనం మంజూరైనా డబ్బులు తల్లి అకౌంట్లోకి రాకపోవడం, మరికొందరికి అసలు మంజూరు కాకపోవడం జరిగింది. వెంటనే 20 రోజుల్లో అన్ని పత్రాలు సమర్పించి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని గతంలో ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. దీనితో ఉరుకుల పరుగులపై విద్యుత్ శాఖ ఆఫీసు చుట్టూ, ఆదాయపు పన్ను ఆఫీసు చుట్టూ తిరిగి అవసరమైన దస్త్రాలు సమర్పించారు. మళ్లీ గ్రీవెన్స్ లు పెట్టారు. ఆ తర్వాత అది గతి లేదు. నెలల తరబడి కాలం గడుస్తున్నా అసలు పెండింగ్‌లో ఉన్న వారికి తల్లికి వందనం విడుదల అవుతుందో లేదో తెలియని అగమ్య గోచర పరిస్థితి కనిపిస్తోందని పలువురు తల్లులు,వారి పిల్లలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు తక్షణమే పరిశీలించి నిధులు విడుదల చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**- మండల,డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు విస్తరణ**

**ఏలూరు,మేజర్‌న్యూస్** : ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను విస్తరించింది. 13వ తేదీ సోమవారం మండల,డివిజనల్,మున్సిపల్ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించ బడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది. ఇది ద్వారా

- తరువాయి 2లో..

# నేడు కలెక్టరేట్‌తో సహా

## అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పిజిఆర్‌ఎస్

**- మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి**



**భీమవరం,మేజర్‌న్యూస్ :** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ నెల 13వ తేదీ సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీకోసంకాల్‌సెంటర్ 1100సేవలను వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపు నిచ్చారు. అర్జీదారులుదాఖలుచేసిన తమఅర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా

- తరువాయి 2లో..

# ఏడాదిలోనే జున్నూరు గ్రామ అభివృద్ధికి 11.50 కోట్లు

**- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు**





**పోడూరు/పాలకొల్లు,మేజర్‌న్యూస్:** ఒక్క ఏడాది కాలంలోనే జున్నూరు గ్రామంలో అభివృద్ధి పనులకు 11.50 కోట్లు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు తెలిపారు.పోడూరు మండలం జున్నూరు గ్రామంలో 255 లక్షలతో

- తరువాయి 2లో..

జిఎస్టి తగ్గించకుండా అమ్మకాలు చేస్తున్న

# మెడికల్ షాపులపై కేసులు





- చింతలపూడి,ఏలూరులో నమోదు
- ఔషధ నియంత్రణ శాఖా ఎడి కళ్యాణ చక్రవర్తి వెల్లడి

**ఏలూరు,మేజర్‌న్యూస్** : జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సెల్వి ఆదేశాలతోజిల్లాఅంతటాఔషధ దుకాణాలను ఔషధ నియంత్రణశాఖ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు.చింతలపూడిలో రెండు, ఏలూరులో ఒక దుకాణాలపై కేసులు నమోదులి చేసినట్లు వెల్లడించారు.ఔషధాలకు సంబంధించి జిఎస్‌టి ఉల్లంఘనలపై 9491063158ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన జీఎస్టీ పన్ను తగ్గింపులను ప్రతి ఒక్కరు అమలు చేయాల్సిందేనని ఉల్లంఘించిన వారిపైకేసునమోదు చేస్తామని జిల్లాఔషధ నియంత్రణ శాఖా అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణచక్రవర్తి చెప్పారు. జిల్లాలో పాత జిఎస్టి ప్రకారం ఔషధాలు అమ్ముతు న్నట్లు వచ్చినసమాచారంపై జిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి జిల్లాఔషధ నియంత్రణశాఖ అధికారుల ను జిల్లా వ్యాప్తంగా ఔషధ దుకాణాలను తనిఖీ చేయాల్సిందిగా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై ఔషధ నియంత్రణశాఖా అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం, తణుకు ఔషధ నియంత్రణ అధికారులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.చింతలపూడిలో 8 దుకాణాల ను తనిఖీ చేయగా విన్‌కేర్, మరొక దుకాణంలోను, ఏలూరులోని స్వాతి మెడికల్స్‌లో ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించామని,

- తరువాయి 2లో..

# కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే డిఎన్ఆర్





**కైకలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు,దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, కూటమి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్ ను కైకలూరు ఏలూరు రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

అనంతరం డి.ఎన్.ఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి జిల్లాలోనూ అత్యాధునిక వైద్యం అందించే లక్ష్యంతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి ముందడుగు వేశారని,వారి హయాంలో 7 కాలేజీల ను పూర్తి చేసి 5 కాలేజీలలో అడ్మిషన్లను ప్రారంభించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెడికల్ కాలేజీలు సేఫ్ లెవెల్ క్లోజర్ కమిటీని ఏర్పాటు చేసి, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమయ్యారని, దేశంలోనే మెడికల్ కాలేజీల్లో ఎక్కడ పిపిపి విధానం లేదని, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం ద్వారా పేద,మధ్య తరగతి ప్రజలు విద్యార్థులు నష్టపోతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్,రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, బలే నాగరాజు, మొట్రూ ఏసుబాబు, సింగంశెట్టి రాంబాబు(రాము) ముంద్రు చార్లెస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంగానమ్మ అమ్మవారి సంబరంలో ఎమ్మెల్యే బడేటి ప్రత్యేక పూజలు





**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక 3,4 డివిజన్ 5 రోడ్ల సెంటర్ సాయిబాబా గుడి వద్ద గంగానమ్మ అమ్మవారి సంబరం మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,కో-ఆప్షన్ సభ్యురాలు జాలా సుమతి,డివిజన్ ఇంచార్జ్ జాలా బాలాజీ,కో-ఇంచార్జ్ సిరిశెట్టి నారాయణ ప్రసాద్ 4 డివిజన్ ఇంచార్జ్ రేవుల గద్ద లాలా గజపతిరాయ్, ప్రెసిడెంట్ చనపతి వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్, యు రూపేష్, డివిజన్ నాయకులు మద్రి ఏసురత్నం, గాలి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పార్టీ రాష్ట్ర సెక్రటరీగా "నెక్కంటి సాయిప్రసాద్"



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్:** పెద్దాపురం మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్‌ను వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వైసిపి పార్టీ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్‌ను మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ మరియు కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావుతో పాటు కౌన్సిలర్లు కొట్టి పవన్‌కిశోర్, ఆరెళ్ళ వీర్రాఘవరావు, విజ్జపు రాజశేఖర్, వైసిపి నాయకులు సుబ్బారావు, చింతా శ్రీనివాసరావు, కోఆప్షన్ మెంబర్ వాసంశెట్టి గంగ, గడపా శివ, దాకమూరి రమేష్, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనను ఆదివారం పట్టణంలో వైస్‌ఛైర్మన్ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకంగా అభినందించిన వారిలో ఉన్నారు.

# అబాకస్ శిక్షణ పిల్లలలో గణిత సామర్థ్యం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచుతాయి - డా.అడ్డాల




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సత్కలావాహినిలో కార్పగం సుందరంచే జాతీయ స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ అబాకస్ అనేది లెక్కలు చేయడానికి ఉపయోగించే ఒక ప్రాచీన సాధనం అని, దీనిని తెలు గులో పూసలపాటీ అని కూడా అంటారని, ఇది ఒక దీర్ఘచతుం్రసాకారపు చెక్క చట్రమును కలిగి ఉంటుందని, ఈ చట్రంలో సమాంతరంగా కొన్ని తీగలు ఉంటాయని. ఈ తీగలకి కొన్ని పూసలు గుచ్చబడి ఉంటాయని, ప్రతి తీగకు ఉన్న పూసల సంఖ్య ఒక సంఖ్యలోని ఒక్కొక్క స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తుందని, సంఖ్యాశాస్త్రంలోని ప్రాథమిక విధానాలైన కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం వంటి లెక్కలు చేయడానికి అబాకస్‌ను ఉపయోగించడం వలన చాలా సులభంగా లెక్కలు చేయొచ్చని తెలిపారు. ఇది మొట్టమొదటగా ఉపయోగించిన లెక్కల సాధనాలలో ఒకటని, ఎలక్ట్రానిక్ కాలిక్యులేటర్లు మరియు కంప్యూటర్లు వచ్చినప్పటికీ, అబాకస్ శిక్షణ పిల్లలలో గణిత సామర్థ్యం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మరియు వేగంగా లెక్కలు చేసే నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి ఇప్పటికీ ఉపయోగించబడుతోందని అన్నారు.

అబాకస్ శిక్షకులు కర్పగం మాట్లాడుతూ ఈ శిక్షణలో, విద్యార్థులు తమ మనసులోనే అబాకస్‌ను ఊహించుకుని లెక్కలు కట్టడం నేర్చుకుంటారని, అబాకస్ ద్వారా గణితం చేయు విధానము, అబాకస్ ఉపయోగించి కూడికలు, తీసివేతలు ఎలా చేయాలో సులభంగా వివరిస్తామని, అబాకస్ బేసిక్ లెవెల్ .. అబాకస్ పరిచయం, పూసల విలువలు వంటి ప్రాథమిక అంశాలు, వేళ్లను ఉపయోగించి అబాకస్ లెక్కలు ఎలా చేయాలో నేర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు చాలా పెద్ద సంఖ్యలు ఉన్న గుణకారం, భాగహారం వంటి లెక్కల ప్రశ్నలకు చాలా సులభంగా సమాధానాలు చెప్పారు. ఈ పిల్లల నైపుణ్యం చూసి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డా. అడ్డాల సత్యనారాయణ మరియు యువసేన సతీష్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డా. దీప్తి, పిల్లలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

మొదటిపేజి తరువాయి

ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో,లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించు కోవచ్చు.

ఇంటి నుంచే ఆన్‌లైన్‌ద్వారా ఫిర్యాదుచేసేందుకు,ప్రభుత్వం అందించినఅధికారిక వెబ్‌సైట్ :https://meekosam.ap.gov.in ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితితదితర సమాచారం తెలుసుకో వాలంటే, 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు.ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తిస్థాయిలో ఉపయోగించు కోవాలని ఆమె కోరారు.

# నేడు కలెక్టరేట్‌తో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పిజిఆర్ఎస్

మొదటిపేజి తరువాయి

తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసు కోవడానికి 1100నంబర్‌కుకాల్ చేయవచ్చున న్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి మీ కోసం వెబ్సైట్ నందు అర్జీలు నమోదు చేసుకోవచ్చును.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్,మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామ న్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదు లను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చున న్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసు కోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఏడాదిలోనే జున్నూరు గ్రామ అభివృద్ధికి 11.50 కోట్లు

మొదటిపేజి తరువాయి

వేడంగి- జున్నూరుపాలెం రహదారి, 23.10లక్షలతో జడ్పీ పాఠశాలలో నూతన భవనం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి రామానాయుడుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు పూల వర్షం కురిపించారు.ఈసందర్భంగామంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమిప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం దిశగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా పాలన అందిస్తుందని ఇటువంటి మంచి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. తాను మొదటిసారి 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందినప్పుడు నడవడానికి కూడా వీలులేని వేడంగి- జున్నురు పాలెం రహదారిని అభివృద్ధి చేయడం జరిగిందని, మళ్లీ నేడు 255 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ రైతు పక్షపాతికగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.కూటమి అధికారంలోకి వచ్చాకే అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ ,సంతోషం వచ్చిందన్నారు.అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ,గుంతలు లేని రోడ్లు, మత్స్యకారులకు వేట నిషేధ సాయంగా రూ.20 వేలు వంటివి అమలు చేశాం.సూపర్ సిక్స్ పథకాలు అమలుతో మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్నామని మంత్రి రామానాయుడు వివరించారు.

# జిఎస్టి తగ్గించకుండా అమ్మకాలు చేస్తున్న మెడికల్ షాపులపై కేసులు

మొదటిపేజి తరువాయి

వాటిపై కేసులు నమోదు చేశామని చెప్పారు.ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఔషధ ధరలకు సంబంధించి 18,12శాతం స్లాబ్‌లో ఉన్న మందులను ఐదు శాతం స్లాబ్ లోకి తీసుకు రావడం జరిగిందని,కేన్సర్‌వంటి దీర్ఘకాలికవ్యాధులకు సంబంధించిన మందులకు పూర్తిగా జిఎస్టి మినహాయించడం జరిగిందన్నారు. కానీ కొన్ని దుకాణాల వారు తమ బిల్లింగ్ ప్రాసెస్‌లో సాఫ్ట్వేర్ అప్డేట్ చేసుకోకుండా వినియోగదాల నుంచి పాత జీఎస్టీ నే వసూలు చేస్తున్నారని, వారిపై కేసు నమోదు చేశామన్నారు. జిల్లాలో మిగిలిన అన్ని దుకాణాలను తనిఖీ చేసి, పాత జిఎస్టి వసూలు చేసే వారిపై కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# 'సుప్రీం' చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య



– తక్షణమే న్యాయవాదిని అరెస్టు చేయాలి

**ఏలూరు, మేజర్ న్యూస్** : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్‌దాడికి యత్నించడం హీనమైన చర్యగా భావిస్తూ డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ విగ్రహంవద్ద ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంతోష్ కుమార్ సారథ్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ ప్రవర్తన రాజ్యాంగ విరుద్ధమైన క్రియగా భావిస్తూ ఈ చర్యను ఖండిస్తూ తక్షణమే ఆయ నపై సుమోటో గా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి ఎస్సీ సామాజిక వర్గంపై చిన్న స్థాయి నుండి దేశ అత్యున్నత స్థాయి వ్యక్తులపై వరకు దాడులు జరుగుతున్నాయని, ఇది హీనమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లా బీఎస్పీ అధ్యక్షులు చిర్ర భరత్ మాట్లాడుతూ ఈ దేశంలో సనాతన ధర్మం పేరుతో మీద దౌర్జన్యాలు చేయడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. ప్రజాస్వామ్యదేశంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.మత్తే బాబి ఏ.విజయ్ కనికెల్లి మురళీకృష్ణ మాట్లాడుతూ 145 కోట్ల జనాభా యోగక్షేమాలతో భావించాలంటే భారత రాజ్యాంగాన్ని కాపాడుతూ మానవ విలువలను మానవ హక్కులను కాపాడాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొద్దుల స్వరూప్ పాము మాన్సింగ్ నాగేంద్రప్రసాద్ కనికెల్లి రవి ప్రసాద్ కర్ణికోటి దిలీప్, రాగోలు సురేష్ రాజేష్ పల్లి విజయ్ జాన్సన్ ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీ కొని మోటారు సైకిలిస్టు మృతి



**భీమడోలుమేజర్ న్యూస్** : మండలంలోని. ఆగడాల లంక ఛానల్ రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి చనిపోయారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆగడాల లంక గ్రామానికి చెందిన సిరంగి మోహనరావు (40) వ్యక్తిగత పనులపై ఆగడాల లంక నుంచి గుండుగొలను గ్రామానికి మోటారు సైకిల్ పై బయలుదేరారు. మార్గమధ్యంలోని వడ్డిగూడెం గ్రామం సమీపంలో ముందుగా మోటారు సైకిల్ పై ప్రయాణిస్తున్న మోహనరావు వాహనాన్ని ఆగడాల లంక నుంచి గుండుగొలను వైపు వస్తున్న లారీ ఒకటి వెనుక నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో మోహనరావు ఘటనా స్థలి లోనే చనిపోయారు. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ఏలూరుమేజర్ న్యూస్** : గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఏలూరులోని వట్లూరు రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఘటనాస్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులకు మృతిని వద్ద ఎటువంటి వివరాలు లభించలేదని, మృతుడు 5.5 అడుగుల ఎత్తు చామనఛాయ నలుపు గళ్ళ తెలుగు చొక్కా బిస్కెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే హెచ్ సి శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

## నకిలీ మద్యం సూత్రధారి ముఖ్య మంత్రి చంద్రబాబే



**పెనుమంట్ర,మేజర్ న్యూస్** : నకిలీ మద్యం సూత్ర ధారిగా ముఖ్య మంత్రి చంద్రబాబే నన్నది ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న వ్యవహారం వల్ల తెలుస్తున్నదని వై సి పి రాష్ట్ర మహిళా నాయకురాలు, జెడ్.పి.టి.సి.కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. ఆదివారం ఈ మేరకు ఆమె ఓ ప్రకటన చేస్తూ ఇన్నాళ్లు వైసీపీ ప్రభుత్వం నకిలీ మద్యం అమ్ముతోందని కూటమి నేతలు గత వైసీపీ ప్రభుత్వంపై విషం చిమ్మారని,దీన్నే ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసి లబ్ధి పొందారని ఆమె అన్నారు. కానీ అబద్ధాన్ని ఎంతో కాలం నిజం అని నమ్మించలేరని, ఇప్పుడు టీడీపీ నేత జయ చంద్రారెడ్డి అన్ని ఆధారాలతో పట్టుబడటంతో నకిలీ మద్యం సూత్రధారి చంద్రబాబాబే అని తేలిపోయిందని ఆమె విమర్శించారు.ఎక్కడ కేసు తన మెడకు బిగుస్తుందేమో అని చంద్రబాబు సరైన విచారణ లేకుండా కేవలం సస్పెండ్ చేసి తమ పార్టీకి సంబంధం లేదని చేతులు దులుపుకున్నారని,నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసి ఆపాపం వైసీపీకి అంటగట్టారని, ఇప్పటికైనా ప్రజలు నిజాలు గ్రహించాలని ఆమె కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు నిజాలు గ్రహించి ప్రజలకు మేలు చెయ్యాలని చూసిన జగన్ అప్పటి పాలన గురించి వాస్తవాలు గ్రహించి,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారంలోకి తెచ్చుకుని, కూటమి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలని గౌరీ సుభాషిణి విజ్ఞప్తి చేశారు.

## డిఎస్సిలో ఉద్యోగాలు పొందిన వారికి శాఖా గ్రంథాలయంలో సత్కారం



**నరసాపురం,మేజర్ న్యూస్**: ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం నందు పుస్తకాలు, పత్రికలు చదువుకొని 2025 మెగా డిఎస్సిలో ఉద్యోగాలు సాధించిన విజేతలను గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి ఆధ్వర్యంలో సత్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తరంగినీడి సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నరు. 14 మంది విజేతలును సన్మానించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆత్మూరి రమ,ట్రెజర్ సమత, పాస్ట్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్,సుధీర్ మోహన్, సూర్యం బాబు జీవన్ కుమార్, రామ కృష్ణ ,నాగవల్లిదేవి, శ్యామ్ గ్రంథాలయ పాఠకులు విద్యార్థులు తదితరు లు పాల్గొన్నారు.

# వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ చే ఉచిత వైద్య శిబిరం



– గుండె , నేత్ర పరీక్షలు చేసిన వైద్యులు

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్** : వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారి ఉచిత వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆదివారం మండలంలోని రాచన్నగూడెం గ్రామంలో డాక్టర్ వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, విజయ హాస్పిటల్స్ ఐ కేర్ వేగవరం వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ వేణు, సర్పంచ్ సన్నం వరలక్ష్మి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు వనమా రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు వనమా వెంకటేశ్వరరావు రిబ్బన్ కత్తిరించి శిబిరాన్ని ప్రారంభించారు. ఈఉచిత వైద్య శిబిరము నందు 285 మంది స్థానికులకు ఈసీజీ పరీక్షల నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో సుమారు 18 మందికి ఎకో అవసరం అవుతుందని వారిని జంగారెడ్డిగూడెం వద్ద వేగవరంలోని తమ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు వైద్యపరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ వేణు తెలిపారు.నేత్ర సంబంధ రోగులకు 48 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు.సాధారణ రోగులకు పరీక్షల నిర్వహించి మందులు అందించినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో డాక్టర్ వేణు కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.శివ వినేష్ ఎంఎస్ ఆర్తో,డాక్టర్ షరీఫ్,ఆర్తో రాజశేఖర్, మార్కెటింగ్ మేనేజర్ వి నరేంద్ర కుమార్, సందీప్,నాగు, బి హరికుమార్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ప్రకటన

మా క్లైంట్ నూలి వెంకటనారాయణరావు అనే నూలి శ్రీనివాన్ఇచ్చిన సంజాయిషీమేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా ది.08-10-2025న నరసాపురానికి చెందిన కోట్ల సాయి వెంకట రాజా వార్తపత్రికలో ఇచ్చిన ప్రకటనకు బదులుగా తెలియజేయు విషయములు ఏమనగా కోట్ల సాయి వెంకట రాజా, నరసాపురం వారికిని మా క్లయింటుకున్ను ఆర్థిక లావాదేవీలు జరుగుచూ ఉన్నవి. సదరు కోట్ల సాయి వెంకటరాజా మా క్లయింటుకు బాకీ పడగా దానిలో కొంత బాకీ వసూలు నిమిత్తం రుస్తుంబాదులో గల ఒక అపార్టుమెంటులో ఇంకా కన్స్ట్రక్షన్ ఉన్న ప్లాట్ నా క్లయింట్ భార్య అయిన నూలి గంగా భవాని గారి పేరున క్రయ దస్తావేజు వ్రాసి ఇచ్చినారు. అలాగే నిలిచి ఉన్న మిగతా బాకీ నిమిత్తం డాక్యుమెంట్ నెంబర్ 3720/2019, తేదీ 04-07-2019 ఈయొక్క డాక్యుమెంటు లింక్ మరియు పట్టాదారు పాస్ పుస్తకము నా క్లయింటుకు కొలెట్రల్ సెక్యూరిటీగా ఇచ్చియున్నారు. ఈ యొక్క బాకీలు ఏమార్చే విధంగా ది.08-10-2025న పైన పేర్కొనబడిన డాక్యుమెంట్స్ పోయినవి అని ప్రకటన యిచ్చినారు గాన సదరు ప్రకటన చెల్లదు అని. దానిలో పేర్కొన బడిన విషయాలు అన్నీ అవాస్తవాలు అని ఇందు మూలముగా యావన్మందికి తెలియ జేయడమైనది. సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

నరసాపురం
ది 10-10-2025

ఇట్లు
కె.అమరేశ్వరరావు,అడ్వకేట్,
నరసాపురం - 9063777879

# మెగా డి.ఎస్.సి విజేతలను సన్మానించి చరిత్ర సృష్టించిన ఎమ్మెల్యే రోషన్






జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ : సాధారణంగా ఉపాధ్యాయులను సన్మానించడం వారు పదవీవిరమణ చేసినప్పుడో లేదా మండల, జిల్లా,రాష్ట్ర జాతీయస్థాయి ఉపాధ్యాయులఅవార్డులు పొందిన సందర్భంగా సన్మానించడం జరుగుతుంది. లేదా వారు పని చేస్తున్న స్కూల్ నుండి మరొక స్కూలుకు బదిలీఅయిన సందర్భంగా సన్మానించడం రివాజు.వీటికి విభిన్నంగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్సిలో విజేతలుగా నిలిచి, ఉపాధ్యాయ వృత్తి లో నూతనంగా ప్రవేశిస్తున్న వారిని సన్మానించడం జరగదు.కాని ఎమ్మెల్యే రోషన్ కుమార్ నియోజకవర్గంలో 150 మంది మెగా డీఎస్సిలో ఉపాధ్యాయులుగా విజేతలై రికార్డు సృష్టించారు.ఈనియోజకవర్గంలో చింతలపూడి మండలం నుంచి 71 మంది,జంగారెడ్డిగూడెం40, కామవరపుకోటలో 25.లింగపాలెం మండలంలో 13 మంది విజేతలై ఉద్యోగాలు పొందారు. వారి కృషి పట్టుదల శ్రమను చూసి ఎమ్మెల్యే రోషన్ కుమార్ జంగారెడ్డిగూడెంలో శనివారం సాయంత్రం నియోజకవర్గంలోని కూటమి నాయకుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పారదర్శకంగా విద్యాభివృద్ధికి విద్యార్థుల్లోని నైపుణ్యం ప్రతిభను వెలికి తీసి ఉత్తమ విద్యార్థులుగా బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తూ వారిని సన్మానించారు. రాష్ట్రం లో ఏనియోజకవర్గంలో ఏఎమ్మెల్యే చేయని విధంగా ప్రప్రథమంగా ఉపాధ్యాయ వృత్తిలో ముందుగా ప్రవేశించే అభ్యర్థులను విజేతలను సన్మానించి,రాష్ట్రంలో నూతన సాంప్రదాయంతో ఇదే ప్రథమంగా చేసి రాష్ట్రంలోనే ఉపా ధ్యాయులపై ఆయ నకున్న అభిమానాన్ని ప్రదర్శించుకోవడం గొప్ప విశేషం. ఉపాధ్యాయ కుటుంబం నుండే వచ్చిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ కు ఉపాధ్యాయ వృత్తి ఎంత విలువైందో దీన్ని బట్టి స్పష్టమైనది.ఈ విధంగా రాష్ట్రంలో ఎవరు ఎక్కడ చేయలేదు. అంతేకాకుండా విజేతలైన ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి మెమొంటోలు బహుకరించారు. ఈమెమొంటోపై ప్రముఖ ఉపాధ్యాయులు మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, చిత్రపటంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తోపాటు తన ఫోటోను కూడా ఉన్న మెమొంటోలను మెగా డీఎస్సీ విజేతలకు శాశ్వతంగా పదిల పరుచుకునే విధంగా రూపొందించి మెమొంటో బదులు అభినందన జ్ఞాపికను విజేత హృదయాల్లో శాశ్వత అభిమానాన్ని పొందారు. ఈ సభ కార్యక్రమాన్ని సీనియర్ ఉపాధ్యాయుడు ఈమని శశి కుమార్‌నిర్వహించటం విశేషం. ఈ సందర్భంగా నూతనంగా ఉపాధ్యాయ వృత్తి స్వీకరించే విజేతలు ఎమ్మెల్యే రోషన్ కుమార్ ను సత్కరించి వారి గౌరవ అభిమానాలను వెల్లడించి,కూటమి ప్రభుత్వ రుణం తీర్చుకుంటామని సవినయంగా తెలియపరచడం జరిగింది.

# పేకాట స్థావరంపై దాడి : 9 మంది అరెస్టు



చింతలపూడి,మేజర్‌న్యూస్ : జిల్లా ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ అదేశాలతో డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో కోడి పందాలు, పేకాట రాయుళ్ళు పైన ఉక్కు పాదం మోపిన చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్,ఎస్ఐ వెంకన్న,సిబ్బంది. పేకాట రాయుళ్ళ పైన చింతలపూడి, లింగపాలెం మండలాలులో వరుస దాడులు లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామం శివారులో పేకాట స్టావరం పైన దాడి చేసి 9 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారివద్ద 14.900 నగదు స్వాధీనం చేసుకున్నారు.

# ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో దోహదం






పెదపాడు,మేజర్ న్యూస్ : యువత ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. యువతకు కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు అంకితభావంతో కృషి చేస్తున్న శిక్షకులు ఇబ్రహీం బేగ్,డిఎల్ నారాయణను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.పెదపాడు మండలం వట్లూరులోని సర్ సిఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల జిమ్‌లో ఆల్ ఇండియా షోటోకాన్ కరాటే ఛాంపియన్ షిప్ –2025 బడేటి కప్పు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతియేటా ఈ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏడు రాష్ట్రాల నుంచి దాదాపు 850 మంది యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనడం ఏలూరు కే గర్వకారణమని పేర్కొన్నారు. రోజురోజుకు కరాటే పట్ల యువతలో ఆసక్తి పెరుగుతోందని, కరాటే వల్ల మానసిక ఆరోగ్యం కూడా కలుగుతుందని చెప్పారు. ఎంతో ప్రాచీనమైన కరాటేకు ఆదరణ తగ్గకుండా,ఎంతో మంది కి శిక్షణ ఇస్తున్న ఇబ్రహీం బేగ్, డిఎల్ నారాయణ అభినందనీ యులని ఎమ్మెల్యే బడేటి చంటి కితాబు ఇచ్చారు. వారికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ ఛాంపియన్ షిప్ కు బడేటి కప్ పేరిట స్పాన్సర్ షిప్ చేయటం ఎంతో సంతోషం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,ఏఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి,మాజీ చైర్మన్ పూజారి నిరంజన్, ఏలూరు అగ్రికల్చర్ సొసైటీ బ్యాంకు చైర్మన్ అమరావతి అశోక్, ఏ కె ఎఫ్ జడ్జిలు ఇబ్రహీం బేగ్, డిఎల్ నారాయణ, కరాటే అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కవులూరి చంద్రశేఖర్, న్యాయవాది కొల్లు శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దిలో హనుమద్ హెూమం



జంగారెడ్డిగూడెం ,మేజర్ న్యూస్ : మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం నందు ఆదివారం హనుమద్ హెూమం ఆలయ అర్చకులు, వేద పండితులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ హెూమ కార్యక్రమం నందు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ హెూమ కార్యక్రమం పర్యవేక్షణ ఆలయ పర్యవేక్షకులు కురగంటి రంగారావు పర్యవేక్షణలో జరిగిందని ఆలయ సహాయ కమిషనర్,కార్యనిర్వహణా ధికారిణి ఆర్. వి. చందన తెలిపారు.

# దేశ నిర్మాణానికి అంకిత భావంతో పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్



జంగారెడ్డిగూడెం ,మేజర్ న్యూస్ : వ్యక్తి జాతి దేశ నిర్మాణాల ద్వారా గత 100 సంవత్సరాలుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆర్ ఎస్ ఎస్ అంకిత భావంతో పనిచేస్తోందని జిల్లా ఆర్ఎస్ఎస్ కార్యవాహ కట్టా శివ గణేష్ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ నందు ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది విజయదశమి ఉత్సవ సందర్భంగా జరిగిన సమావేశంనకు జిల్లా సంఘం చాలక్ గడ్డమణుగు సత్యనారాయణ (దత్తుడు) అధ్యక్షత వహించారు. సమావేశంలో శివ గణేష్ ప్రసంగిస్తూ ఆర్ఎస్ఎస్ సామాజిక సమరసత పర్యావరణ పరిరక్షణ స్వదేశీ స్వాలంబన,పౌర విధులు, కుటుంబ ప్రబోధన ఈ 5 అంశాలను తీసుకొని దేశ అభివృద్ధికి ప్రతి స్వయం సేవక్ పనిచేసేలాగా సంఘం నిర్దేశించిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హర్షవర్ధన్, హాస్పటల్ ఎండి అట్లూరి హర్షవర్ధన్ మాట్లాడుతూ యువతలోను, విద్యార్థులలోను దేశభక్తి నైతిక విలువలకు క్రమశిక్షణను పెంపొందిస్తున్న ఆర్ఎస్ఎస్ కృషి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విశేషంగా స్వయం సేవక్ గణేష్ ఆర్ఎస్ఎస్ డ్రెస్ కోడ్ వేసుకొని పాల్గొన్నారని ప్రచార ప్రముఖ వేదుల జనార్ధన రావు తెలిపారు.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి : 9 మందిపై కేసు నమోదు



నూజివీడు ,మేజర్ న్యూస్ : నూజివీడు డీఎస్పీ కెవివిఎన్ వి ప్రసాద్ ఆదేశాల మేరకు, నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై జ్యోతిబసు ,సిబ్బంది కలిసి పేకాట శిబిరాలు పై ప్రత్యేక దాడులు నిర్వహించారు. దేవర కొండ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుండి రూ.46,450 నగదు,52 పేక ముక్కలు సీజ్ చేశారు. పట్టుబడ్డ వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబసు తెలియ చేశారు. గ్రామాల్లో ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు లేదా డయల్ 112 కు,ఎస్ఐ.జ్యోతిబసు సెల్ ఫోన్ నెంబర్ 9440796440 కు సమాచారం అందించాలని,వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

# పెద్ద ఎత్తున అమ్మవారి అఖండ అన్న సమారాధన





**కైకలూరు,మేజర్‌న్యూస్** : శరన్నవరాత్రి వేడుకలు ముగిసిన సందర్భంగా అమ్మవారు ఆలయంలోగవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ కైకలూరులో కొలువై ఉన్న శ్రీ శ్యామలాంబ అమ్మవారిని దర్శించుకుని మహా కుంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం నందు దసరా ఉత్సవాలు పురస్కరించుకొని ఏర్పాటు చేసిన భారీఅఖండ అన్నసమారాధనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కామినేని పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరికి అన్న ప్రసాదం అందే విధంగా చూడాలని దేవస్థాన సిబ్బందికి,ఉత్సవ కమిటీ సభ్యులకు,పోలీస్ వారికి తగు సూచనలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, ఎంపీపీ అడవి వెంకటకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు బూరు బోయిన శ్రీనివాసరావు, బి కే యం నాని,పూల రామచంద్రరావు, బోయిన శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెనుమంట్ర వద్ద గోస్తానీ నదిలో పేరుకు పోయిన కిక్కిస

**– ఎస్ ఐ పర్రు నుండి మామూడూరు వరకు తొలిగింపు**



**పెనుమంట్ర,మేజర్ న్యూస్** : పెనుమంట్ర మండలం ప్రధాన మురుగు డ్రైన్ అయిన గోస్తానీ నదిలో గత నాలుగు నెలలుగా పేరుకుపోయిన కిక్కీస ను తొలగించకపోతే ఎగువ నుండి వచ్చే మురుగు దిగువకు వెళ్లకుండా పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో సోమరాజు ఇల్లిందలపర్రులో రైతులు మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకు వచ్చారు. దీనితో వాటర్ డిస్ట్రిక్ట్ బోర్డు చైర్మన్ తో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన వేల్పూరు నుండి మాముదూరు వరకు కిక్కిసను తొలగించాలని లేకుంటే రైతులు క్రాప్ హాలిడే అవకాశాలున్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు పెనుమంట్ర వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెలగలబులి రామిరెడ్డి పనులను శరవేగంగా నిర్వహించారు.ఎస్ ఐపర్రు నుండి మాముదూరు వరకు సుమారు 18 కిలోమీటర్లు సుమారు కోటి 30 లక్షల వ్యయంతో తొలగింపుకు చర్యలు చేపట్టారు.15 కిలోమీటర్ల పొడవునా పనులు పూర్తయ్యాయి మరో 3,4 రోజుల్లో మాముదూరు వరకు గోస్తానని కిక్కేస తొలగింపు జరుగుతుందని అత్తిలి డ్రైనేజీ ఏఈ వివేకానంద తెలిపారు. దీంతో రైతులకు పొలాల ముంపు సమస్య తీరిందని సార్వ పంటకు ముంపు ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చొరవతో సమస్య పరిష్కరించారని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## బాధిత వృద్ధురాలికి ఫ్రెండ్స్ అసోసియేషన్‌చే వీల్ చైర్ వితరణ

**ఏలూరు,మేజర్ స్యూస్ :** ఫ్రెండ్స్ అసోసియేషన్ కుటుంబ సభ్యులైన కవులూరి మహేష్ దంపతులు, శక్తి ప్రసాద్ దంపతులు కలసి సంయుక్తంగా నడవలేని స్థితిలో వున్న నాగమణి అనే వృద్ధురాలకు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీల్ చైర్ సదుపాయం కల్పించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొని ఆమెకు పండ్లు,వస్త్రాలు అందించారు.

# 17న తణుకులో జిల్లా యువజనోత్సవాలు

**– పోటీల్లో పాల్గొనేందుకు 15 నుండి 29 సంవత్సరాల యువతీ యువకులు అర్హులు**

**– 15న ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళ : జిల్లా కలెక్టర్ నాగరాణి**

**భీమవరంమేజర్‌స్యూస్** : 2026 జనవరి 12న వివేకానంద జయంతి సందర్భముగా జరుగు జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యములో యువతకు అనేక అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

పోటీలలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయి పోటీలకు,అదేవిధంగా రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయిలో జరిగే జాతీయ యువజనోత్సవాలకు పంపడం జరుగుతుంది అన్నారు.జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఈ నెల 17న తణుకు ఎస్‌కేఎస్ డి మహిళా కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

దీనిలో భాగంగా ఈ నెల 15న భీమవరం ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.


జిల్లా స్థాయి పోటీ అంశాలలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యం (సోలో), వెస్ట్రన్ డాన్స్ (గ్రూపు) ఉంటాయన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు అభ్యర్థులు సొంతఖర్చులతో పాల్గొనాల్సి



ఉంటుందన్నారు. పోటీలకు సంబంధిం చిన వాయిద్య పరికరాలు, అలంకరణలు, తదితర వస్తువులు అన్నింటిని అభ్యర్థులే సమకూర్చు కోవాలన్నారు.జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి, రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయికి ఎంపిక కాబడిన అభ్యర్థులకు ప్రయాణ,భోజన వసతి సదుపాయాలు అన్ని యువజన సర్వీసుల శాఖ అందించడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొను యువతీ యువకుల వయస్సు 15 నుండి 29 సంవత్సరాలు మాత్రమే ఉండాలని, రాష్ట్రస్థాయి పోటీలు 2025 నవంబర్ నెలలో, జాతీయ స్థాయి పోటీలు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 2026 జనవరి నెలలో ఢిల్లీలో జరుగు జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్స్ 9441446999, 9490938012, 7075230609 నందు సంప్రదించాలని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే యువజ నోత్సవాలలో యువతి, యువకులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత యువతి మృతి



**దెందులూరు,మేజర్ స్యూస్** : 19 ఏళ్ల వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన దెందులూరు మండలం సానిగూడెం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. నేతల నీలమణి (19)గా మృతురాలిని గుర్తించారు. ఇంటి వద్ద ఆమె ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మృతి ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దేశ ధర్మముల రక్షణయే ఆర్ఎస్ఎస్ లక్ష్యం



**పెనుగొండ,మేజర్ న్యూస్:** దేశ ధర్మముల రక్షణ కోసం ఆర్ఎస్ఎస్ అవిశ్రాంతంగా కృషి చేస్తుందని పెను గొండ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బడేటి వీరబ్రహ్మం (బ్రహ్మాజీ) పేర్కొన్నారు. ఎనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి మహోత్సవం ఘనంగా జరిగింది. తొలుత ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన వాసవి శాంతిధామ్ ప్రధాన అర్చకులు శిష్టా మణికంఠ శర్మ మాట్లాడుతూ నేడు హిందూ సమాజం సుసంఘటితమై పునర్నిర్మితం కావాలని, ప్రపంచంలోనే భారతదేశం విశ్వ గురువుగా నిలబడడం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు.తదనంతరం స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర సహ కన్వీనర్ సత్తి షణ్ముఖ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రారంభమై నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో చింతాకుల గోపాలకృష్ణ,సానబోయిన ఉర్ధన్య, ఏడిద సూర్య పవన్ కుమార్, బిరుదుగంటి సుబ్రమణ్యం, మామిడిశెట్టి ఆంజనేయులు, రమణమ్మ గుడి విజయ్ కుమార్ రెడ్డి, స్వయంసేవక బంధువులు, మాతృమూర్తులు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రి సందర్భంగా భారీ అన్న సమారాధన



**నర్సాపురం ,మేజర్ న్యూస్:** పట్టణంలోనిస్టీమర్ రోడ్ సెంటర్లో ఉన్న శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ ప్రారంభించింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.పరిసర ప్రాంత గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు హాజరై అన్న సమారాధనలో పాల్గొన్నారు. దేవీ నవరాత్రులు ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు వ్యక్తిగత కార్యదర్శి సంకు భాస్కర్ నాయుడు మండెల సత్యనారాయణ,గునిశెట్టి సత్యనారాయణ, మండెల కృష్ణస్వామి నాయుడు,గునిశెట్టి శ్రీనివాస్ మహా నివేదనకు హారతులు ఇచ్చి అన్న సమారాధనను ప్రారంభించారు. దైవ కార్యక్రమాల్లో అన్న సమారాధనలు నిర్వహించడం భగవత్ సేవతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి రామకృష్ణ సాయి, చిత్తూరు శ్రీను,కుంచె ఈశ్వరరావు, చిట్టి అంజి మార్కెట్ వర్తకులు,ఉత్సవ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'శక్తి 'యాప్ పై మహిళలకు 'టీం' అవగాహన





– బాలికలు,మహిళల భద్రతకు గస్తీ చర్యలు

**ఏలూరు, మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావు ఆధ్వర్యములో శక్తి టీం సభ్యులు ఏలూరు,జంగారెడ్డి గూడెం, పోలవరం,నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో గస్తీ చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాలలో, మహిళ లపై ఎటు వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించారు. శక్తి యాప్ మహిళల భద్రతకు సంబంధించిన అత్యవసర స్పందన, మొబైల్ అప్లికేషన్.

దీనిని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అభివృద్ధి చేసింది. ఇది ముఖ్యంగా మహిళలు, బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించేందుకు రూపొందించబడింది అని, ఏది అయినా అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ఉపయోగించిన ఎడల లేదా డయల్ 112 కు సమాచారం అందించిన పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. దీని ద్వారా సమీప పోలీస్ గస్తీ బృందం తక్షణమే మీ వద్దకు చేరుకోగలదని తెలిపారు. మహిళా రక్షణపై నమ్మకమైన సాధనం ఈ యాప్ ద్వారా మహిళలు రాత్రి పూట లేదా ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు భద్రత గా భావించవచ్చని వివరించారు. శక్తి యాప్ లో మహిళల హక్కులు, చట్టాలు, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ లు మొదలైన సమాచారం లభిస్తుందన్నారు. సైబర్ నేరాలు, వేధింపులు వంటి వాటి గురించి కూడా అవగాహన పొందవచ్చని శక్తి టీం సభ్యులు పేర్కొన్నారు. హెల్ప్ లైన్ నెంబర్ లను అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 112 – ఎమర్జెన్సీ నెంబర్ 181 – మహిళా హెల్ప్ లైన్ వంటి నెంబర్లను నేరుగా యాప్ నుండి కాల్ చేయవచ్చు. ఫ్రెండ్ ట్రాకింగ్ / సేఫ్టీ షేరింగ్. మీ స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో లైవ్ లొకేషన్ ను పంచుకోవచ్చు వారు మీ ప్రయాణాన్ని గమనించవచ్చని,ప్రతి మహిళా తమ ఫోన్‌లో ఈ యాప్ తప్పనిసరిగా ఉంచుకోవాలని జిల్లా శక్తి టీం సభ్యులు ప్రజలకు తెలిపారు.

# నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించిన ఏలూరు జిల్లా రవాణా శాఖ



**ఏలూరు,మేజర్ న్యూస్** : ఏలూరు జిల్లాకు టార్గెట్ 5.10 కోట్లు – 5.80 కోట్లు వసూళ్లు చేసిన రవాణా శాఖ అధికారులు. వాహన తనిఖీల విభాగంలో నూరు శాతం లక్ష్యాన్ని జిల్లా రవాణా శాఖ అధికారులు అధిగమించారు. వాహన తనిఖీల మీద నెలకు 85 లక్షల రూపాయల చొప్పున ఏప్రియల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు మాసాలకు 5.10 కోట్ల రూపాయలను ఏలూరు జిల్లాకు లక్ష్యముగా నిర్ణయించగా 5.80 కోట్ల రూపాయలను సాధించినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు.

మోటార్ వాహనాలకు 8,821 కేసులు నమోదు చేయడం ద్వారా 114 శాతం లక్ష్యాన్ని సాదించగలిగామన్నారు. ఇందులో ఫిట్నెస్ లేనందుకు 1,018 కేసులు నమోదు చేయడం ద్వారా రూ. 24లక్షల 83వేలు పర్మిట్ లేనందుకు 374 కేసులు నమోదు చేయడం ద్వారా రూ. 36,36,300 పన్ను చెల్లించనందుకు 2,273 కేసులు నమోదు చేయడం ద్వారా రూ. 18,76,600, డ్రైవింగ్ లైసెన్స్ లేనందుకు గాను 1,349 కేసులు నమోదు చేయడం ద్వారా రూ. 33,10,200 హెల్మెట్ ధరించనందుకు గాను 1,319 కేసులు నమోదు చేయడం ద్వారా 10లక్షల 90వేలు వాహన ఇన్సూరెన్స్ లేనందుకు గాను 1,357 కేసులు నమోదు చేయడం ద్వారా 27లక్షల 48వేలు అపరాధ రుసుము విధించి, నూటికి నూరు శాతమే కాకుండా అదనంగా 14 శాతం లక్ష్యాన్ని అధిగమించినట్లు కరీమ్ తెలిపారు.

# విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న లక్షల కోట్లు స్వదేశానికి తీసుకురావాలి




– బడా బాబులకు,రాజకీయవేత్తలకు కోట్లు రుణమాఫీలు చేయడం ఏమిటి ?

**ఏలూరు, మేజర్ న్యూస్:** సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి నేటికీ 20 సంవత్సరాలు పూర్తయి 21వ సంవత్సరంలోకి అడుగెడుతున్న సందర్భంగా ఆదివారం ఏలూరు శ్రీరామ్ నగర్ లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు కమ్మ శివరామకృష్ణ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమల్లో అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తయినప్పటికీ భారతదేశంలోని కేవలం 20శాతం ప్రజలకు మాత్రమే సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా సమాచారహక్కు చట్టంపై అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని, ఈ సంఘం తరపున విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికీ ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వడంలో అవగాహన లోపం ఉందని, దేశంలో నీ అన్ని వర్గాలకు తమ సొంత అవసరాలకు సమస్యలకు, ప్రభుత్వ పరంగా జరిగే లోపాలను సరిదిద్దడంలోనూ, సమాచార హక్కు చట్టంద్వారా వచ్చే సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుందని శివరామకృష్ణ వివరించారు. సుప్రీంకోర్టును కూడా సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావడం జరిగినదని తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి నాగ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఇంకా సమాచార హక్కు చట్టం గురించి అర్థమయ్యే రీతిలో ప్రజల్లోకి తీసుకువెళ్లి మంచి అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట మండల అధ్యక్షులు అబ్బూరి లక్ష్మీనారాయణ, సెక్రటరీ అయినాలా శ్రీనివాసరావు. జాయింట్ సెక్రటరీ నరసింహారావు, ఏలూరు అధ్యక్షులు యుగంధర్ శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'కరెంటు బ్రహ్మం' సేవలు చిరస్మరణీయం

– పితాని వెంకట్ పరామర్శ



**పెనుగొండ ,మేజర్‌న్యూస్** : పెనుగొండ పట్టణానికి చెందిన కీర్తిశేషులు యానాపు సూర్యప్రకాశ్ రావు (కరెంటు బ్రహ్మం) మరణవార్త తెలుసుకున్న మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సూర్యప్రకాశ్ రావు కుమారుడు యానాపు సత్తిబాబుతో మాట్లాడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్తిబాబు మాట్లాడుతూ మా తండ్రి ప్రజల మధ్య జీవించారు, ప్రజల కోసమే ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ సమస్య వచ్చిన ప్రతిసారీ ఎవరైనా అర్ధరాత్రి పిలిచినా, ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా బయలుదేరేవారు. ప్రజల కష్టమే ఆయనకు తన కష్టం అనిపించేది' అని స్మరించారు. సూర్యప్రకాశ్ రావు విద్యుత్ రంగంలో అనన్యసామాన్య సేవలు అందించి, పెనుగొండ మరియు పరిసర గ్రామాలకు వెలుగు నింపారు. రాత్రింబగళ్లు తేడా లేకుండా ప్రజల పక్కనే నిలబడి సమస్యలు పరిష్కరించిన ఆయన సేవా తపన అపూర్వమైనదని పితాని వెంకట్ అభిప్రాయపడ్డారు. "అలాంటి ప్రజాసేవకుడు మరచిపోలేనివారు. ఆయన జీవితం మనందరికీ ఆదర్శం" అని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్నేహితులు, గ్రామస్తులు కూడా యానాపు సూర్యప్రకాశ్ రావు గారి సేవలను స్మరించుకొని నివాళులర్పించారు.

## నేడు సూపర్ జిఎస్టి అవగాహనకు బైక్ ర్యాలీ

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్** : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థానిక పురపాలక సంఘంలో ఈ నెల 13వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు సూపర్ జిఎస్టి సూపర్ – సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ప్రజలలో అవగాహన కల్పించడం కోసం బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నామని కమిషనర్ కె.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ పురపాలక సంఘం కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## లయన్స్ ,హేలాపురి లయన్స్ చే దివ్యాంగుల కృత్రిమ కాలు స్క్రీనింగ్ శిబిరం





**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్** : జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్ ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన దివ్యాంగుల కృత్రిమ కాలు స్క్రీనింగ్ శిబిరం ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రం మొత్తంలో 62 మంది దివ్యాంగులు ఎంపికయ్యారు. 22 మంది వరకు ఎంపిక కాలేదు. వీరిని తర్వాత జరిగే కార్యక్రమానికి రావలసిందిగా తెలిపారు. ఎంపిక అయినా దివ్యాంగులకు 15 రోజుల్లో కాళ్లు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దాసరి శేషు కుమార్, కొండపల్లి పండు,మద్దిపాటి నాగేశ్వరరావు,కన్నా హనుమంతు రావు అట్లూరి సురేష్,పంతగాని వెంకన్న, ఉక్కుర్తి సీతారాం, ఖండవల్లి ఆశీర్వాదం,మేడిచర్ల రవి,తదితరులు పాల్గొన్నారు. ఏలూరు లయన్స్ క్లబ్ సభ్యులు కె.బి.రావు, కోర్సు శ్రీనివాస్, చలసాని అరుణ్ కుమార్, దేవినేని రమాదేవి, సరస్వతి వాణి,కణాల లక్ష్మీ కుమారి,ఖమ్మం రోటరీ క్లబ్ సభ్యులు రంగారావు, సాంబ శివరావు తోపాటు సిబ్బంది పాల్గొన్నారు. దివ్యాంగులకు రావి పద్మ కుమారి కృత్రిమ కళ్ళ తయారీ సెంటర్ ద్వారా కాళ్ళను అమర్చనున్నారు.

# రైతు బాంధవుడు మండవ వెంకటరామయ్య



– సంస్మరణ సభలో ఎంపీ పుట్టా మహేష్ నివాళులు

హైదరాబాద్ / ఏలూరు,మేజర్ న్యూస్ : గత నెల 22న మరణించిన నూజివీడు సీడ్స్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్) గ్రూప్ వ్యవస్థాపకుడు మండవ వెంకటరామయ్య సంస్మరణ సభ ఆదివారం "సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్" పేరుతో హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని ప్రధాన్ కన్వెన్షన్‌లో జరిగింది.

ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మండవ వెంకటరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు బాంధవుడిగా అనేక అవార్డులు, ప్రశంసలు పొందిన మండవ వెంకటరామయ్య 1973లో నూజివీడు సీడ్స్ లిమిటెడ్ స్థాపించారు. మండవ ఫౌండేషన్ ద్వారా పలు స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తున్న వెంకటరామయ్య రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో కూడా భాగస్వామి అయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు నూజివీడు నియోజకవర్గంలోని తన స్వగ్రామం తుక్కులూరుతో పాటు ఆగిరిపల్లి గ్రామంలో పలు పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. రైతులకు, వ్యవసాయ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రస్తుతం ఎన్ఎస్ఎల్ గ్రూప్ కు సీఎండీగా వ్యవహరిస్తున్న ఆయన పెద్ద కుమారుడు ప్రభాకరరావును ఎంపీ పరామర్శించారు.

# స్వచ్ఛతాహి సేవ అంటే ఇదేనా ?





– అపరిశుభ్రతలో టాప్ జీలుగుమిల్లి గ్రామ పంచాయతీ

జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్ : స్వచ్ఛత హి సేవ అంటే శనివారం చేసేది మాత్రమేనా అపరిశుభ్రతతో తమకేం పని అనే నిర్లక్ష్యంలో అధికారులు గ్రామంలో ఏదో ఒకచోట ఫోటో దిగితేచాలు పని అయినట్లేనని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వం గ్రామాలను పారిశుధ్యం నుండి విముక్తి కల్పించాలని పథకాలు ప్రవేశపెడితే అధికారులు మాత్రం పథకాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం తాండవిస్తుంది. స్థానిక జగదంబ సెంటర్‌లోనూ బస్టాండ్‌లో అపరిశుభ్రత దుర్వాసనతో తాండవిస్తున్న అధికారులకు కానరావడం లేదు. నిత్యంఅనేక మంది ప్రజలు ప్రయాణం చేసేందుకు స్థానిక బస్ స్టాండ్ లోను,ఏలూరు వైపు వెళ్లే చోట చెత్త వలన తీవ్ర దుర్గంధంతో అపరిశుభ్రత కు నిలయంగా మారడంతో నిలబడ లేకపోతున్నామని ప్రయాణిస్తున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్ స్టాప్‌లో ఉన్న పారిశుధ్యంతో తమకేంపనిలే అన్నట్లు స్థానిక పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.నిత్యం వందలాది మంది ప్రయాణించే ప్రాంతాలలో పారిశుధ్యం తాండవిస్తుంటే రోగాలు బారిన పడమ అంటూ ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వాలు స్వచ్ఛతహి సేవ అని గ్రామాలను పారిశుధ్య రహితంగా తీర్చిదిద్దాలని సంకల్పిస్తే అధికారుల నిర్లక్ష్యాన్ని వహిస్తున్నారంటున్నారు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాలలో ఉన్న అపరిశుభ్రతను తొలగించాలని కోరుతున్నారు.

# ఘనంగా గంగానమ్మ అమ్మవారి సంబరాలు





– గంగానమ్మ ,మహాలక్ష్మమ్మ ,పోతురాజు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

– ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు ఆకాంక్ష

ఏలూరు,మేజర్ న్యూస్ : పలు డివిజన్‌లలో ఆదివారం శ్రీ గంగానమ్మ ,మహాలక్ష్మమ్మ ,పోతురాజు బాబు సంబర మహోత్సవాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక 3వ డివిజన్ సత్యనారాయణ పేటలో ఉన్న గంగానమ్మ ఆలయంలో,2వ డివిజన్ బావిశెట్టి వారిపేటలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో,6వ డివిజన్ బగ్గయ్యపేట లో, 7వ డివిజన్ తూర్పు వీధిలోని చాటపర్రు రోడ్డులో జరుగుతున్న ఈ ఉత్సవానికి ఉత్సవ కమిటీ వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్,నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఆ గంగానమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

శ్రీ గంగానమ్మ మహా లక్ష్మమ్మ పోతురాజు బాబు సంబరం మహోత్సవములు భక్తి ఆధ్యాత్మికతకు ప్రతీకలు.

రాష్ట్ర ప్రజలకు శాంతి, సమృద్ధి, సుఖసంతోషాలు, కలగాలని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషిచేయాలని సంకల్పంతోనే ఈ పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు వీరంకి పండు, 3 వ డివిజన్ ప్రెసిడెంట్ నడిపూడి ఈశ్వర్ రావు,జనసేన నాయకులు రెడ్డి గౌరీశంకర్,సరిది రాజేష్,ఎట్రించి ధర్మేంద్ర, జనసేన రవి, పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమం అనంతరం అమ్మవారి ప్రసాద వితరణతో వేడుకలు ముగిశాయి.

## యాదవ కళ్యాణ మండపానికి రూ.50 లక్షలు కేటాయించాలి



– రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌నుకు యాదవ సంఘం నేతల వినతి

విజయవాడ / ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపం అభివృద్ధి నిమిత్తం 50 లక్షల రూపాయలు నిధులు కేటాయించాలని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవను ఏలూరు జిల్లా యాదవ సంఘం నాయకులు ఆదివారం ఉదయం విజయవాడ లోని ఆయన కార్యాలయంలో కలిసి చిన్న వెంకన్న ప్రసాదాలను జ్ఞాపికను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన అనుకూలంగా స్పందించారని సంఘ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు,యాదవ సంఘం కళ్యాణ మండప అధ్యక్షులు ముమ్మిడి చింతయ్య, జిల్లా యాదవ సంఘం సెక్రటరీ కూరాకుల వీర వెంకట సత్యనారాయణ,జిల్లా యాదవ యూత్ అధ్యక్షులు కాట్రు బాలకృష్ణ, సిదరబోయిన శ్రీనివాస్, పిల్లల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దాతల వితరణతో ముగ్గురికి కృత్రిమ కాళ్ల అమరిక



ఆగిరిపల్లి, మేజర్ న్యూస్: మండలపరిధి తోటపల్లి గ్రామంలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఆదివారం దాతల సహకారంతో ముగ్గురు దివ్యాంగులకు కృత్రిమకాళ్ళను అమర్చారు.ప్రముఖ సంఘ సేవకులు కాకర్ల శంకర రావు, నాగళ్ళ కృష్ణ మోహన్, డా. అడుసుమిల్లి ప్రతాప్ కుమార్ ల ఆర్థిక సహాయంతో ప్రకాశం జిల్లాకు చెందిన కొల్లూరి చెన్న కేశవ, గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన కొక్కిలిగడ్డ సాయిబాబు,కృష్ణా జిల్లా కేసరపల్లికి చెందిన మంగళగిరి అర్జునరావు కు కృత్రిమ కాళ్ళను అందచేశారు. సమాజ బాధ్యత గల దాతలు ముందుకు వచ్చి దివ్యాంగులకు సహాయపడటం హర్షణీయమని హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కోనేరు సత్య ప్రసాద్ దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హీల్ సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్, డా.జి.వెంకట్రావు, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య పరిరక్షణ శిబిరం



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : మానసిక ఆరోగ్యం కోసం అందరూ ఇంటర్నెట్‌కు మొబైల్ ఫోన్స్‌కు దూరంగా ఉండాలనీ,చెడు వ్యసనా లకు దూరంగా ఉండాలని లయన్స్ 316జి జిల్లా పూర్వపు గవర్నర్ లైన్ గట్టి మాణిక్యాలరావు అన్నారు. గత 10 రోజుల నుండి తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న మెంటల్ హెల్త్ ఎవేర్నస్ శిబిరాలు ముగింపు సందర్భం గా ముఖ్య అతిథిగా గట్టిం మాణిక్యాలరావు పాల్గొన్నారు. స్నేహ మైండ్ క్లినిక్ మానసిక వైద్య నిపునులు, డాక్టర్ పృథ్వీరాజ్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి మానసిక ఆరోగ్యం పరిరక్షణకై శిక్షణ ఇచ్చారు. లయన్ బడుగు చంద్రశేఖర్,లయన్ కరిబండి రామకృష్ణ, పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ లయన్స్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజులు మాట్లాడుతూ అంతర్జాతీయ లయన్స్ క్లబ్ లో 316జి జిల్లా గవర్నర్ లయన్ ఎన్ వి.వి.ఎస్.పాపారావునాయుడు పిలుపు మేరకు ఈ అవగాహనా శిబిరాలు నిర్వహించామన్నారు. గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో లయన్ బడుగు చంద్రశేఖర్, ఉమర్ ఆలీషా పీఠంలో లయన్ కరిబండి రామకృష్ణ లు నిర్వహిస్తున్న ఉచిత యోగాతో పాటు మెడిటేషన్ (ధ్యానం)ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజాత్రినాథ్, మానేపల్లి కిరణ్ కుమార్, యర్ర ఆంజనేయస్వామి,కాళ్ళ కార్తీక్, నున్న నాగేశ్వరరావు, ప్రసాద్, గణపతిరాజు, గురజాడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.